లక్షెట్టిపేట బార్ అసోసియేషన్ ఎన్నికలు

జీ కిరణ్ కుమార్ వీ నళినికాంత్

లక్షెట్టిపేట, మార్చి 28: లక్షెట్టిపేట న్యాయస్థానంలో గురువారం బార్ అసోసియేషన్ ఎన్నికలను ఓటింగ్ పద్ధతి ద్వారా నిర్వహించారు. గడికొప్పుల కిరణ్ కుమార్ తన ప్రత్యర్థి అక్కల శ్రీధర్‌పై రెండు ఓట్ల మెజార్టీతో అధ్యక్ష పదవికి ఎన్నికయ్యాడు. జాయింట్ సెక్రటరీగా వొజ్జల నళిని కాంత్ 25 ఓట్లు రావడంతో తన ప్రత్యర్థి తిప్పని రవిపై భారీ విజయం సాధించాడు. మొత్తం న్యాయస్థానంలో 37 ఓట్లకు గాను 31ఓట్లు పోల్ అయ్యాయని తెలిపారు. ఎన్నికైన సభ్యులను జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా హరీశ్, తోటి న్యాయవాదులు అభినందించారు.

మాలమహానాడు నియోజకవర్గ అధ్యక్షుడిగా రామస్వామి

గరిసె రామస్వామి

సీసీసీ నస్పూర్, మార్చి 28: జాతీయ మాల మహానాడు మంచిర్యాల నియోజకవర్గం అధ్యక్షుడిగా నస్పూర్‌కు చెందిన గరిసె రామస్వామిని నియమించారు. ఈ మేరకు గురువారం మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గజెల్లి లక్ష్మణ్, జై భీమ్ సైనిక్ దళ్ రాష్ట్ర కన్వీనర్ ఆసాది పురుషోత్తం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలితపు శంకర్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి పలిగిరి కనకరాజు ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. రామస్వామి గతంలో విద్యార్థి, యువజన ప్రజా పోరాటాలు చేశారని, అంబేద్కర్ కోల్ బెల్ట్ ఏరియా ప్రధాన కార్యదర్శిగా పని చేసిన అనుభవం ఉందని తెలిపారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన నాయకులందరికీ గరిసె రామస్వామి కృతజ్ఞతలు తెలిపారు. మాల మహానాడు అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

హాజీపూర్, మార్చి 28: పేకాడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు హాజీపూర్ ఎస్ఐ గోపతి సురేశ్‌కుమార్ తెలిపారు. గురువారం ఉదయం కర్ణమామిడి గ్రామ శివారులో కొందరు పేకాడుతున్న సమాచారం మేరకు సిబ్బందితో కలిసి వెళ్లగా అక్కడ పేకాడుతున్న వారిని అదుపులోకి తీసుకొని నగదు రూ.3660, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

తల్లిదండ్రుల వద్దకు తప్పిపోయిన బాలుడు

బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న కానిస్టేబుల్ సంతోష్

తాండూర్, మార్చి 28 : తప్పిపోయిన బాలుడిని గంటల వ్యవధిలోనే తాండూర్ పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అచ్చలాపూర్‌కు కూలీపని నిమిత్తం ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన రాజేశ్‌కుమార్ కుమారుడు సుశాంత్‌కుమార్(2సంవత్సరాలు) పని స్థలం వద్ద గురువారం తప్పిపోయాడు. తల్లిదండ్రులు డయల్ 100 నంబర్‌కు సమాచారం అందించారు. వెంటనే తాండూరు పోలీసులు స్పందించారు. మండల కేంద్రం నుంచి అచ్చలాపూర్ వైపు వెళ్తుండగా అటు నుంచి వచ్చే అచ్చలాపూర్‌కు చెందిన వ్యక్తి అచ్చలాపూర్ వైపు నుంచి చిన్నబాబు ఏడుస్తూ నడుచుకుంటూ వస్తున్నాడని తెలిపాడు. వెంటనే పోలీసులు, సమాచారం అందించిన వ్యక్తిని కలిసి బాబుని చేరదీసి అచ్చలాపూర్‌లో వారి తల్లిదండ్రులకు అప్పగించారు. బాలుడి తల్లిదండ్రులు, బంధువులు బాలుడి కోసం వెతుకుతుండగా బాలుడు దొరికిన విషయం తెలుసుకొని ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులకు బాలుడి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండూర్ పీసీ సంతోష్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలి

- రాజకీయ పార్టీల నాయకులతో సమావేశంలో బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

హాజరైన రాజకీయ పార్టీల నాయకులు

మాట్లాడుతున్న బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్

మందమర్రి, మార్చి 28: ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని, ఎన్నికలు శాంతియుతంగా జరిగేలా పోలీసు శాఖకు సహకరించాలని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ రాజకీయ పార్టీల నాయకులను కోరారు. మందమర్రి పట్టణంలోని సింగరేణి సీఈఆర్ క్లబ్‌లో లోక్‌సభ ఎన్నికల సందర్భంగా మందమర్రి, రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులతో గురువారం నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టి రాజకీయ పార్టీల మధ్య గొడవలు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా సహకరించాలన్నారు. మందమర్రి సీఐ శశీధర్ రెడ్డి మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మందమర్రి, రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలో జరిగిన పలు సంఘటనలను ఉదహరిస్తూ అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా సహకరించాలని కోరారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, ఎన్నికల ప్రచారంలో అనుమతులు తీసుకునేందుకు సువిధ సీ విజిల్, టోల్ ఫ్రీ నంబర్ 1950 ప్రాముఖ్యతను వివరించారు. తహసీల్దార్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకునే విధంగా అన్ని పార్టీల నాయకులు సహకరించాలని సూచించారు. ఈ సమావేశంలో మందమర్రి ఎస్ఐ ఎస్.రాజశేఖర్, రామకృష్ణాపూర్ ఎస్ఐ జీ.రాజశేఖర్, అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

భీమారంలో పోలీసుల కవాతు

భీమారంలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

భీమారం, మార్చి 28 : భీమారం మండలం కేంద్రంలోని ఆవుడం క్రాస్ రోడ్డు నుంచి మొదలుకొని బస్టాండ్, రావి చెట్టు వాడ, స్థానిక చర్చి నుంచి ఆవుడం క్రాస్ రోడ్డు వరకు జైపూర్ ఏసీపీ వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో సీఆర్‌పీఎఫ్, పోలీసులు గురువారం సాయంత్రం కవాతు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ మాట్లాడుతూ..పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సంఘ విద్రోహ చర్యలకు పాల్పడే వారిపై పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ సీఐలు మోహన్, శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్, జైపూర్ ఎస్ఐ, భీమారం ఎస్ఐ రాములు, ఏఎస్ఐలు శకుంతల, హెడ్‌కానిస్టేబుళ్లు ముత్తయ్య, మాచర్ల, సిబ్బంది ఆసంపల్లి కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జైపూర్‌లో..

జైపూర్, మార్చి 28: ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు సూచించారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జైపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందారం లో పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని కోరారు. ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఇందారం రాజీవ్‌రహదారి బస్టాండ్ నుంచి దొరగారిపల్లె వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ మోహన్, ఎస్ఐ శ్రీధర్, నాగరాజు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి మున్సిపాలిటీలో కుంభకోణాలు

- ఆర్డీ, సీడీఎంఏకు ఫిర్యాదు చేస్తాం : కౌన్సిలర్లు

బెల్లంపల్లి, మార్చి 28 : బెల్లంపల్లి మున్సిపాలిటీలో అనేక కుంభకోణాలు జరుగుతున్నాయని మున్సిపల్ కౌన్సిలర్లు ఆరోపించారు. గురువారం పాత మున్సిపల్ కార్యాలయంలో వారు మాట్లాడారు. కమీషన్ల కోసం లక్షలాది రూపాయలతో జేసీబీలు, ట్రాలీలు కొనుగోలు చేసి వినియోగించడం లేదని వెల్లడించారు. రూ.37 లక్షలతో 25 రోజుల క్రితం జేసీబీని ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రారంభించారని తెలిపారు. కానీ పట్టణంలోని 34 వార్డుల్లో ఎక్కడ కూడా ఆ జేసీబీతో పనులు చేయించలేదని ఆరోపించారు. కౌన్సిల్ ఆమోదం లేకుండానే జేసీబీని కొనుగోలు చేశారన్నారు. గతేడాది రూ.18 లక్షలతో కొనుగోలు చేసిన జేసీబీని ఏ ఒక్క రోజు కూడా ఏ వార్డులోనూ తిరగలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. 28 చెత్త ట్రాలీలను తీసుకువచ్చినా మెయింటనెన్స్ లేక అవి తుప్పు పడే దశకు చేరుకున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాహనాలకు పట్టణంలోని కాల్‌టెక్స్, రైల్వేస్టేషన్ల పెట్రోల్ బంకుల్లో పెట్రోల్ పోయించకుండా మండలంలోని తాళ్ల గురిజాల పెట్రోల్ బంక్‌లో కొన్ని వాహనాలకు మాత్రమే పెట్రోల్ పోయించి డబ్బులు స్వాహా చేస్తున్నారని ఆరోపించారు. చెత్త క్లీనింగ్ మిషన్‌ను కూడా సరిగా వినియోగించడం లేదన్నారు. ఇంటింటికీ వెళ్లి ఆస్తి పన్నులు వసూలు చేస్తున్న మున్సిపాలిటీ ప్రజాధనాన్ని ఈ విధంగా దుర్వినియోగం చేస్తున్నదని విమర్శించారు. కూరగాయల భవన నిర్మాణం ముందుకు సాగకపోవడంతో కూరగాయల వ్యాపారులు రోడ్ల మీద తమ విక్రయాలు చేసుకుంటున్నారని మండిపడ్డారు. పట్టణ ప్రగతిలో కోట్లాది రూపాయల నిధులు దుర్వినియోగమయ్యాయని ఆరోపించారు. కుంభకోణాలపై విజిలెన్స్‌తో సమగ్రంగా విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో జరుగతున్న కుంభకోణాలపై ఆర్డీ, సీడీఎంకు ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు.

అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టవద్దు

- నస్పూర్ మున్సిపల్ కమిషనర్ సతీశ్
- పట్టణంలో అక్రమ కట్టాడాల కూల్చివేత

అనుమతి లేకుండా నిర్మించిన కట్టడాన్ని కూల్చి వేస్తున్న సిబ్బంది

సీసీసీ నస్పూర్/శ్రీరాంపూర్, మార్చి 28: నస్పూర్ మున్సిపాలిటీలో అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టవద్దని మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీశ్ సూచించారు. గురువారం డీటీఎఫ్ టీం సభ్యులు శ్రీనివాస్(నస్పూర్ తహసీల్దార్), టౌన్‌ప్లానింగ్ అధికారి ఆర్ సతీశ్ మున్సిపల్ పరిధిలో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. శ్రీరాంపూర్ ఆర్‌కే-6 కొత్తరోడ్డులో నిర్మించిన 2 షెడ్లు, నస్పూర్ శివారు సర్వేనంబర్ 24లో 4 సెట్‌బ్యాక్ నిర్మాణాలు, విలేజ్ నస్పూర్‌లోని సర్వే నంబర్ 42లో అక్రమంగా నిర్మించిన ఇంటి నిర్మాణాలను జేసీబీతో కూల్చివేశారు. సర్వేనంబర్ 11లో వెలిసిన హద్దురాళ్లను తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టా భూమిలో నిర్మాణాలు చేపడితే తప్పకుండా పర్మిషన్లు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ భూముల్లో చేపట్టే నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వబోమని, ఒక వేళ నిర్మాణాలు చేపడితే మున్సిపల్ చట్టం-2019 ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

శ్రీరాంపూర్ ఏరియా 16వ వార్డులో ..

'ఏఆర్ఎస్'లో ఉత్సాహంగా ఫేర్‌వెల్ వేడుకలు

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

జన్నారం, మార్చి 28 : మండల కేంద్రంలోని ఏఆర్ఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఆర్ఆర్ఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఫేర్‌వెల్ పార్టీలో విద్యార్థులు చేసిన నృత్యాలు అక్కడికి వచ్చిన వారిని అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ముత్యం సతీశ్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గణితంపై ఆసక్తిని పెంచేందుకే క్విజ్ పోటీలు

గణిత ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

మందమర్రి రూరల్, మార్చి 28: విద్యార్థుల్లో గణితంపై అభిరుచిని, ఆసక్తిని పెంపొందించేందుకు క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్లు ఆదర్శ(మోడల్) పాఠశాల ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని ఆదర్శ(మోడల్) పాఠశాలలో నిర్వహించిన గణితం సంబురాల్లో 6 నుంచి 9వ తరగతి విద్యార్థులకు గణితంపై ముగ్గులు (రంగోలి), క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా జయకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు గణిత భావనాలను సులభంగా ఆకలింపు చేసుకోవడానికి నిర్వహించిన క్విజ్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నట్లు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల గణిత ఉపాధ్యాయులు అమీర్ పాషా, ఉపాధ్యాయులు, విద్యార్థులున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్ చోరీ

కాసిపేట, మార్చి 28 : కాసిపేట మండలంలోని వెంకటాపూర్ శివారులోని పత్తి చేనులో 25కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రూ.5 వేల విలువైన 23 కిలోల అల్యూమినియం కాయిల్స్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. విద్యుత్ శాఖ ఏఈ శేర్ల స్వర్ణలత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బ్యాగులు, లంచ్ బాక్సులు అందజేత

పిల్లలతో ఫార్మా కంపెనీ అధికారులు

మంచిర్యాల అర్బన్, మార్చి 28 : ఆనంద నిలయంలోని అనాథ పిల్లలకు మ్యాన్ కైండ్ ఫార్మా లిమిటెడ్ ఆధ్వర్యంలో 30 మందికి రూ. 30 వేల విలువైన స్కూల్ బ్యాగ్స్, లంచ్ బాక్సులు, స్టేషనరీ ఐటమ్స్ కిట్‌ను గురువారం విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫార్మా ఏరియా మేనేజర్ దాసరి సాయిబాబా, న్యూరో ఫిజీషియన్ డాక్టర్ తిరుమల్ రావు, ఐఆర్‌సీఎస్ రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడు మధుసూదన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి చందూరి మహేందర్, కోశాధికారి సత్యపాల్ రెడ్డి, ఫార్మా కంపెనీ రిప్రజెంటేటివ్స్ సారా, మహేశ్, ఆశ్రమ నిర్వాహకులు సదానందం, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

'అంజనీ పుత్ర' ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం

రక్తదానం చేస్తున్న అంజనీ పుత్ర సంస్థ సభ్యులు

మంచిర్యాల అర్బన్, మార్చి 28 : అంజనీ పుత్ర సంస్థ చైర్మన్ గుర్రాల శ్రీధర్ పుట్టిన రోజును పురస్కరించుకొని ఎండీ పిల్లి రవి నేతృత్వంలో గురువారం పట్టణంలోని శ్రీనివాస గార్డెన్స్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సంస్థ ప్రతినిధులు, కస్టమర్లు సుమారు మూడు వేల మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య మాట్లాడుతూ ప్రజలకు తనవంతు సేవ చేయడమే కాకుండా వ్యాపార రంగంలో రాణిస్తూ అందరికీ ఆదర్శంగా అంజనీ పుత్ర సంస్థ నిలుస్తుందన్నారు. సంస్థ చైర్మన్ శ్రీధర్ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారని, మున్ముందు మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. అనంతరం గుర్రాల శ్రీధర్ జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సంతోష్, కిషన్, కస్టమర్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కేక్ కట్ చేస్తున్న అంజనీ పుత్ర సంస్థ చైర్మన్ శ్రీధర్

అనుమతి లేని మందులు సీజ్

- హీలింగ్ ఫార్మా కంపెనీపై డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమిడీస్ యాక్ట్ కింద కేసు

సీజ్ చేసిన మందులను చూపుతున్న అధికారులు

మంచిర్యాల ఏసీసీ, మార్చి 28 : మంచిర్యాల జిల్లా కేంద్రంలో అనుమతి లేకుండా విక్రయిస్తున్న మందులను డ్రగ్ అధికారులు గురువారం సీజ్ చేశారు. పట్టణంలోని వరలక్ష్మీ మెడికల్ దుకాణంలో అమ్మకానికి ఉన్న ఆయుర్వేదిక్ డ్రగ్ (ఆర్థోజింట్ ఆయిల్)ను అనుమతి లేకుండా విక్రయిస్తుండగా కరీంనగర్ డీసీఏ ఏడీ ఎం శ్రీనివాసులు, జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ టీ చందన పట్టుకొని సీజ్ చేశారు. వారు మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా ఈ డ్రగ్ బయటపడిందని, దీనిని ఫెరాలసిస్, నొప్పులకు ఉపయోగిస్తున్నారని, ముంబై లో మ్యానుఫ్యాక్చర్ అయిన హీలింగ్ ఫార్మా కంపెనీపై డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమిడీస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి ఐదు బాటిళ్లను సీజ్ చేశామన్నారు.

వాహనాల తనిఖీ

వాహన పత్రాలు పరిశీలిస్తున్న ఎస్ఐ శ్యాంపటేల్

వేమనపల్లి, మార్చి 28 : వేమనపల్లి మండల కేంద్రంలోని రహదారిపై గురువారం నీల్వాయి ఎస్ఐ శ్యాంపటేల్ వాహనాలు తనిఖీ చేశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వాహనాలు తనిఖీలను ముమ్మరంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎవరైనా మద్యం, నగదు, ఇతర వస్తువులు అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా సరైన ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలకు ఈ-చలాన్ ద్వారా జరిమానాలు విధించారు.

రూ.90 వేల నగదు సీజ్

కాసిపేట, మార్చి 28 : కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమగూడెం చొప్పరిపల్లి సమీపంలో పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్ట్ వద్ద కాసిపేట ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఎలాంటి ఆధారాలు లేకుండా బెజ్జూర్‌కు చెందిన మోర్లె తిరుపతి రూ.90 వేల నగదు తరలిస్తుండగా స్వాధీనం చేసుకొని పోలీసులు సీజ్ చేసి ఎస్ఎస్‌టీ టీమ్‌కు అప్పగించినట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ వివరించారు.

చేరదీసి..దుస్తులు అందించి..

- మతిస్థిమితం లేని వ్యక్తికి స్థానికుల సాయం

మతిస్థిమతం లేని వ్యక్తికి క్షవరం చేయిస్తున్న శ్రీరాంపూర్ కాలనీ వాసులు

స్నానం చేయించి దుస్తులు తొడిగిన స్థానికులు

శ్రీరాంపూర్, మార్చి 28 : శ్రీరాంపూర్ కాలనీ బస్టాండ్ ఏరియాలో తిరుగుతున్న మతిస్థిమితం లేని వ్యక్తికి స్థానికులు చేయూతనందించారు. కొన్ని నెలలుగా దుస్తులు లేకుండా దిగంబరంగా తిరుగుతుండడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో స్థానిక వ్యాపారులు, మెకానిక్, నాయిబ్రాహ్మణ కార్మికులు ముందుకు వచ్చి ఆ వ్యక్తికి క్షౌరం, గడ్డం తీయించి, స్నానం చేయించారు. దుస్తులు తొడిగి, భోజనం అందించారు. మతిస్థిమితం లేని వ్యక్తి చేతిపై నరేశ్ పచ్చబొట్టు ఉన్నది. సాయం చేసిన వారిని స్థానికులు అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడు చంద్రయ్య, మోటర్ మెకానిక్ ల్యాకత్, వ్యాపారులు రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి

రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలి

- సింగరేణి ప్లానింగ్, ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి

కేకే ఓసీ అధికారులతో మాట్లాడుతున్న డైరెక్టర్ వెంకటేశ్వర్

మందమర్రి, మార్చి 28: రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సింగరేణి ప్లానింగ్, ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వర్ రెడ్డి సూచించారు. సింగరేణి మందమర్రి ఏరియాలోని కేకే ఓసీ, కేకే ఐదు గనులను గురువారం ఆయన ఏరియా జనరల్ మేనేజర్ ఏ.మనోహర్‌తో కలిసి సందర్శించారు. కేకే ఓసీ గని ప్లాన్లను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఓపెన్ కాస్ట్ గనిలో ఓబీ ఎంత ఎక్కువగా తీస్తే అంత ఎక్కువ బొగ్గును ఉత్పత్తి చేసి రవాణా చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. కేకే-5 గనిలోకి మ్యాన్ రైడింగ్ ద్వారా వెళ్లి పని స్థలాలను పరిశీలించారు. భూగర్భ గనిలో అధికారులు, కార్మికులు సమన్వయంతో బొగ్గు ఉత్పత్తికి కృషి చేయాలన్నారు. రక్షణ చర్యలను పకడ్బందీగా చేపట్టాలని రక్షణ విషయంతో రాజీ వద్దని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేకే ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ రమేశ్, కేకే ఐదు గని మేనేజర్ అల్లావుద్దీన్, ఎస్‌కే గ్రూప్ ఏజెంట్ విజయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేటగిరి ఉద్యోగోన్నతి లేఖలందించాలి

- ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి వీరభద్రయ్య

మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్, మార్చి 28 : శ్రీరాంపూర్ ఏరియాలో కార్మికులకు వెంటనే కేటగిరీ ఉద్యోగోన్నతి లేఖలు అందించాలని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కే వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా డిమాండ్ చేశారు. గురువారం శ్రీరాంపూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ కార్మికులకు 2023-24కు సంబంధించిన కేటగిరీ ఉద్యోన్నతి లేఖలు సెప్టెంబర్‌లోనే ఇవ్వాల్సి ఉండగా 2024 మార్చి పూర్తవుతున్నా ఇవ్వలేదని ఆరోపించారు. యాజమాన్యం రాజకీయ ప్రమోయంతోనే లేఖలు ఇవ్వడంతో జాప్యం చేస్తున్నదని ఆరోపించారు. గనులపై 4 నెలల క్రితమే లేఖలు వచ్చాయన్నారు. వాటిని తిరిగి జీఎం కార్యాలయానికి తీసుకున్నారని తెలిపారు. ఎన్నికల కోడ్‌ను అడ్డం పెట్టుకొని జాప్యం చేస్తున్నదన్నారు. ఉద్యోగోన్నతి లేఖలతో పాటు మార్చి నాటికి చెల్లించాల్సిన ఇంక్రిమెంట్ కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, సహాయ కార్యదర్శి కొమురయ్య, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, బద్రి బుచ్చయ్య, ప్రసాద్‌రెడ్డి, నర్సింగారావు, లచ్చయ్య పాల్గొన్నారు.

ఉత్తమ రైతులకు సన్మానం

సంద్రోనిపల్లెకు చెందిన రైతు పెంటయ్యను సన్మానిస్తున్న అధికారులు

బెల్లంపల్లిరూరల్, మార్చి 28: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలకు చెందిన ఇద్దరు రైతులను గురువారం జగిత్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం అధికారులు ఘనంగా సత్కరించారు. ఉత్తర తెలంగాణ వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా సంఘం సమావేశంలో మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని సంద్రోనిపల్లె గ్రామానికి చెందిన రైతు పీ పెంటయ్య వరిని సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తూ పచ్చిరొట్ట ఎరువులు, జీవన ఎరువులు, జీవ శిలీంధ్రాలను మాత్రమే ఉపయోగిస్తూ భూసారాన్ని కాపాడుతుండడం, శాస్త్రవేత్తల సలహాలను పాటిస్తూ పెట్టుబడిని తగ్గించడం, ఆధునిక వ్యవసాయ పద్ధతులతో వరి, పెసర, మినుము పంటల సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలోని గంగాపూర్‌కి చెందిన యువ రైతు వడాయి శంకర్ అధిక సాంద్రత గల పత్తిని సాగు చేస్తూ సమగ్ర ఎరువుల, కలుపు, చీడపీడల యాజమాన్యాన్ని చేపట్టి పెట్టుబడిని నియంత్రించుకుంటూ ఎకరానికి 16 క్వింటాళ్ల దిగుబడిని సాధించి, వివిధ పద్ధతుల్లో కూరగాయల సాగు చేపడుతూ వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తరింపజేస్తున్నాడు. వీరి కృషిని గుర్తించి యూనివర్సిటీ రిజిస్ట్రార్ వెంకటరమణ, పరిశోధనా స్థానం సంచాలకుడు రఘురామిరెడ్డి, విస్తరణ సంచాలకురాలు సుధారాణి, సహ సంచాలకుడు శ్రీనివాస్ సత్కరించారు